
వెంగళరావునగర్ కాలనీలో పెద్దమ్మతల్లి యువ సంకల్ప ఆర్గనైజేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద అమ్మవారిని దర్శించుకున్న జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి


సైట్-3 పెద్దమ్మనగర్ అమ్మవారి పూజలో పాల్గొన్న అఖిల భారత వడ్డెర బోయి బెల్దారి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, తిరుమల దేవి -బోరబండ, ఆంధ్రజ్యోతి


మహిషాసురమర్దిని అలంకరణలో జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సామూహిక కుంకుమార్చన

ఖైరతాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ మారుతీనగర్‌లోని వెంకటలక్ష్మమ్మ దేవాలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు పాల్గొని భక్తి శ్రద్ధలతో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మహేష్ యాదవ్, మహేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రావణ దహనానికి ఏర్పాట్లు

ఖైరతాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా ఖైరతాబాద్ హనుమాన్ వ్యాయామశాల ఆధ్వర్యంలో రావణ దహనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మాజీ కార్పొరేటర్ జి.కృష్ణ యాదవ్ తెలిపారు. ఖైరతాబాద్ హనుమాన్ వ్యాయామశాల మందిరం వద్ద శనివారం రాత్రి 8.00 గంటలకు రావణ దహనం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయంతో పాటు పరిసరాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు.

గజ్జెలమ్మ ఆలయంలో అన్నదానం

ఖైరతాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖైరతాబాద్ గజ్జెలమ్మ దేవాలయంలో శుక్రవారం అన్నదానం చేశారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో అన్నదానం నిర్వహించారు. ఇందులో భక్తులు, నాయకులు, ఆలయ నిర్వాహకులు రాకేష్ ముదిరాజ్, ముఖేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.



సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రసిద్ధ సెవెన్ టెంపుల్ (ఏడు దేవాలయాలు)ను నవరాత్రి సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ సందర్శించారు

- సనత్‌నగర్, ఆంధ్రజ్యోతి

వాటర్‌బోర్డు విజిలెన్స్ పేరుతో వసూళ్లు

● వ్యక్తిపై కేసు నమోదు చేసిన అధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు విజిలెన్స్ విభాగానికి చెందిన అధికారిని అంటూ అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అధికారుల వివరాల ప్రకారం.. వాటర్ బోర్డు డివిజన్-6లోని జూబ్లీహిల్స్ సెక్షన్ పరిధిలో ప్రైవేట్ ట్యాంకర్ డ్రైవర్‌గా ఎస్.వంశీకృష్ణ అనే వ్యక్తి పనిచేస్తున్నారు. అర్రా సాయి కుమార్ అలియాస్ సాయిరామ్ అనే వ్యక్తి తాను వాటర్‌బోర్డు విజిలెన్స్ విభాగంలో పని చేస్తున్నానని ఫోన్ చేశాడు. బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ట్యాంకర్ పనిచేస్తోందంటూ రూ.20 వేలు ఇవ్వాలంటూ డ్రైవర్ వంశీకృష్ణను డిమాండ్ చేశాడు. తర్వాత అతని దగ్గరి నుంచి రూ.3 వేలు వసూలు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. అర్రా సాయికుమార్ వాటర్‌బోర్డుకి చెందిన వ్యక్తి కాదని, కేవలం బోర్డు పేరు చెప్పుకొని అక్రమంగా డబ్బు వసూలు చేశాడని అందులో తేలింది. దీంతో వంశీకృష్ణ ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫలితంగా అర్రా సాయికుమార్ అలియాస్ సాయిరామ్‌పై పలు సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఎవరైనా వాటర్‌బోర్డు ప్రతిష్ఠకు భంగం కలిగించేలా, బోర్డుకు చెడ్డ పేరు తీసుకువచ్చేలా ప్రవర్తిస్తే.. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



సాయికుమార్

విజిలెన్స్ విభాగంలో కొందరు వాటర్‌బోర్డు డివిజన్లు, సెక్షన్లలో బెదిరింపులకు దిగుతున్నారు. ఇలా వాటర్‌బోర్డు డివిజన్లలోని జీఎం నుంచి మేనేజర్లు, సెక్షన్ సిబ్బందిని, చివరకు ట్యాంకర్ల డ్రైవర్లు, యజమానులను కూడా బెదిరింపులకు దిగుతున్నారు. అక్రమార్కులు విజిలెన్స్ పేరుతో బెదిరింపులకు దిగుతుండడం విశేషం.

వాటర్‌బోర్డు ఉన్నతాధికారులు గుర్తించి విజిలెన్స్ పేరుతో జరుపుతున్న అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు చేపట్టాలని వాటర్‌బోర్డులోని పలువురు ఇంజనీర్లు కోరుతున్నారు.

కేసీఆర్ బాధితులు చాలామంది ఉన్నారు

● మాజీ ఎంపీ రవీంద్రనాయక్

పంజాగుట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యమం ముసుగులో మాజీ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలు, ఉద్యమకారులను తీవ్రంగా మోసం చేశారని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ ఆరోపించారు. ఆయన బాధితులు చాలామంది ఉన్నారని, టీఆర్ఎస్ ఆవిర్భావ సభ్యుడిగా ఉన్న తనను తెలంగాణ భవన్ నుంచి బయటకు గెంటేశారని అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అప్పుల పాల్జేసిన ఘనత ఒక్క కేసీఆర్‌కే దక్కుతుందని, పదేళ్లలో సుమారు రూ.8 లక్షల కోట్లు అప్పులు చేశారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన చేస్తున్నారని, ఆయనకు రాష్ట్రప్రజలు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎంతోమంది నాయకుల రాజకీయ భవిష్యత్తుతో ఆడుకొని, వారిని పార్టీ నుంచి బయటకు పంపారని.. గిరిజనులు, మహిళలకు టికెట్లు ఇవ్వలేదన్నారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత క్విడ్‌ప్రో పేరుతో వేలాది ఎకరాల అసైన్డ్, నయీం, దేవాదాయ, వక్ఫ్, మిగులు భూములు కబ్జా చేయడమే కాకుండా వాటిని మాయం చేశారని ఆరోపించారు. ఆయన వల్లనే కూతురు కవిత జైలు పాలైందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో వందల సంఖ్యలో చెరువులు కనుమరుగయ్యాయని, మళ్లీ కేసీఆర్ కుటుంబంలో ఎవరు సీఎం అయినా తెలంగాణ నాశనం తప్పదని పేర్కొన్నారు. కేసీఆర్ కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుందామని ఆయన పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రవీంద్రనాయక్

జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను స్వస్థలాలకు బదిలీ చేయాలి

పంజాగుట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవో 317 ద్వారా స్థానికతను కోల్పోయిన ఉద్యోగ ఉపాధ్యాయులను స్వస్థలాలకు బదిలీ చేసిన తర్వాతనే కొత్తగా డీఎస్సీ 2024 ద్వారా నియామకం అయిన ఉపాధ్యాయులకు పోస్టింగులు ఇవ్వాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవో 317 ద్వారా స్థానికతను కోల్పోయిన ఉద్యోగ ఉపాధ్యాయులు అవస్థలు పడుతూ కుటుంబాలకు, భార్యపిల్లలకు, వృద్ధులైన తల్లిదండ్రులకు దూరంగా ఎంతో అవస్థ పడుతున్నారని అన్నారు. వారిని వెంటనే తమ స్వస్థలాలకు బదిలీ చేసిన తర్వాతనే కొత్తగా డీఎస్సీ 2024 ద్వారా నియామకం అయిన ఉపాధ్యాయులకు పోస్టింగులు ఇవ్వాలని అన్నారు. పెండింగ్ డీఏలను, గత రెండు సంవత్సరాలుగా ట్రెజరీలో పెండింగులో ఉన్న వివిధ రకాల బిల్స్, మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లును వెంటనే చెల్లించాలని కోరారు. ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు.




జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద వాహనాలకు పూజలు చేయిస్తున్న భక్తులు

ఆర్థరైటిస్‌ను ముందే గుర్తిస్తే చికిత్స ఉంది

● అవగాహన వాక్‌లో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప



ఆర్థరైటిస్ వాక్‌లో పాల్గొన్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తదితరులు

ఖైరతాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జన్యుపరమైన లోపాలతో చిన్న పిల్లల్లో, యుక్త వయస్సు వారికి సైతం కీళ్ల వాతం, రుమటైడ్ ఆర్థరైటిస్ వచ్చే అవకాశాలు ఉన్నాయని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అన్నారు. దీనిని ముందే గుర్తించి చికిత్స తీసుకుంటే నయం చేయవచ్చునని ఆయన సూచించారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినం సందర్భంగా శుక్రవారం ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్, హైదరాబాద్ ఆధ్వర్యంలో జలవిహార్ నుంచి పీపుల్స్‌ప్లాజా వరకు ఆర్థరైటిస్ వాక్ నిర్వహించారు. దీనిని బీరప్ప నిమ్స్ రుమటాలజీ విభాగాధిపతి డాక్టర్ లీజా రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడుతూ మన దేశంలో రుమటాలజిస్టులు తక్కువ మంది ఉన్నారని, ఈ వ్యాధికి ఖరీదైన మందులు వాడాల్సి ఉంటుందని అన్నారు. వ్యాధి లక్షణాలుంటే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. వాక్‌లో పెద్ద ఎత్తున వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఆపి ఎలెక్టెడ్ ప్రెసిడెంట్ డాక్టర్ వరప్రసాద్, కార్యదర్శి డాక్టర్ విజయ ప్రసన్నలతో పాటు వైద్యులు పాల్గొన్నారు.

జలమండలి కాంగార్ యూనియన్ ఆవిర్భావం

బర్కత్‌పుర, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీకి అనుబంధంగా జలమండలి కాంగార్ యూనియన్ ఆవిర్భవించింది. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్ సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం బర్కత్‌పుర లోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మాజీ ఎంపీ, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి కార్యవర్గ వివరాలను వెల్లడించారు. అధ్యక్షుడిగా రాజిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బి.భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.రామరాజు ఎంపికయ్యారు.













సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా: కిషన్‌రెడ్డి


బీదలబస్తీ గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

బౌద్ధనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీ గ్రౌండ్‌లో కేంద్రనిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు ధృడంగా ఉండడానికి జిమ్‌ల ఏర్పాటు చేస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంపీ నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలను సికింద్రాబాద్ నియోజయకవర్గంలో చేపడుతున్నానని తెలిపారు. కార్యక్రమంలో మహంకాళీ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, కనకట్ల హరి, కార్యదర్శి మద్దెర్ల శ్యాంసుందర్, సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, భాస్కరగిరి, బీదలబస్తీ అధ్యక్షుడు నందారం సీతారాం పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో రోగులకు కోడిగుడ్ల పంపిణీ


కోడిగుడ్లను చూపుతున్న వైద్యులు

అడ్డగుట్ట, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కోడిగుడ్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం గాంధీ ఆస్పత్రిలో జరుపుకొన్నారు. వెటర్నరీ ఆఫ్ హైద్రాబాద్ సంస్థ, ఎన్ఈసీసీ హైదరాబాద్ ప్రతినిధులు డాక్టర్ ఎస్ రవీందర్‌రెడ్డి, సంజీవ్ చింటవార్ బృందం 6 వందల కోడిగుడ్లను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు వారి సహాయకులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారీ, డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు


విగ్రహ ప్రతిష్ఠనలో భక్తులు

తిరుమలగిరి అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీహనుమాన్ ఆలయంలో శ్రీలలిత త్రిపుర సుందరీ దేవి ఉప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా జరిగాయి. విగ్రహ దాతలు పర్ష నిరంజన్, పర్ష వెంకట రమణ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం ఆవాహిత దేవతా హోమాలు, కళాహోమాలు, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కళషాభిషేకం, అర్చణ, మహామంగళ హారతి పూజలు జరిగాయని ఈఓ మహేందర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఆశీర్వచనం, తీర్థప్రసాదాల వితరణ జరిగింది. మాజీ బోర్డు సభ్యుడు లోకనాథం, వేదపండితులు రాఘవేందరరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధనంజయచారి పాల్గొన్నారు.


బతుకమ్మ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలు

బతుకమ్మ పోటీల్లో విజేతలకు బహుమతులు

సనత్‌నగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ జెక్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అందమైన పూలతో బతుకమ్మలను పేర్చిన మహిళలను వేడుకల కమిటీ నిర్వాహకులు విజేతలను ఎంపిక చేశారు. స్పాన్సర్లు స్వప్న, విజయలక్ష్మి, భాగ్యలత, కృష్ణకుమారి విజేతలకు పట్టుచీరలు బహుమతిగా అందజేశారు. పోటీలో పాల్గొన్న మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.


పెన్షనర్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ యూట్యూబ్ చానల్‌ని అల్ ఇండియా రైల్వేమన్ ఫెడరేషన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య చిలకలగూడలో శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ్ నాయకులు భరణీ భానుప్రసాద్, షేక్ రవూఫ్, ఏజీకే మూర్తి పాల్గొన్నారు.
- చిలకలగూడ, ఆంధ్రజ్యోతి)


లోకనాయక్ జయప్రకాష్ నారాయణ జయంతిని సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి తార్నాకలోని తన కార్యాలయంలో నిర్వహించారు. జయప్రకాష్ నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర నాయకులు ప్రొ. వెంకటరాజయ్య, బాలుయాదవ్, శ్రీనివాస్, జీవన్, రాజేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.
- తార్నాక, ఆంధ్రజ్యోతి

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టాల పక్కన నడుకుంటూ వెళ్తున్న వృద్ధుడి రైలు ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. సఫిల్‌గూడ - రామకృష్ణాపురం రైల్వేస్టేషన్ మార్గమధ్యం లో శుక్రవారం రైల పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తున్న 67 ఏళ్ల వృద్ధుడిని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

చిలకలగూడ చౌరస్తాలో గుర్తుతెలియని మృతదేహం



అడ్డగుట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనది. గోపాలపురం ఎస్ఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడ చౌరస్తా వద్ద పిల్లర్ నంబరు 1156 వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చి ఘటనాస్థలికి చేరుకున్నారు. అక్కడికి వచ్చిన 108 సిబ్బంది అతడిని పరిశీలించగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు 87155 69117 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.











అలరించిన ఉషా ఉతుప్ సంగీత కచేరి

బోయినపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బాంగియా శిక్ష నికేతన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 'సర్వోజనిన్ దుర్గోత్సవ్' పేరుతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోయినపల్లి పాత ఎయిర్‌పోర్ట్ రోడ్డులోని తెలంగాణ గార్డెన్‌లో బెంగాలీలు పలు కార్యక్రమాలతోపాటు సంగీత కచేరిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గాయని ఉషా ఉతుప్ పలు పాటలు పాడి అహూతులను ఉర్రూతలూగించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన బెంగాలీలు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.


బాపూజీనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్


తిరుమలగిరి బంజారానగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న మహిళలు


కాకాగూడ హనుమాన్ ఆలయం వద్ద నిర్వహించిన హోమంలో జె.రామకృష్ణ, అనురాధ దంపతులు


రిసాల బజార్‌లోని బుజిలీ మహాకాళీ ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న మురళీయాదవ్

వైభవంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

మారేడుపల్లి/ తిరుమలగిరి, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ వెస్ట్‌మారేడుపల్లి జైదుర్గా భవాని ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగిన దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమములో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని నల్లపోచమ్మ అమ్మవారిని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ దర్శించుకున్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక పూజలు నిర్వహించారు. మండప అసోసియేషన్ ప్రతినిధులు భరత్‌కుమార్, నిహల్, అనిల్‌కుమార్, నాగరాజు, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ సి.సంతోష్ యాదవ్, నాయకులు అర్జి నాగేష్ యాదవ్, రేపాల వెంకటేశ్వర్లు, రాజగోపాల్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు. దేవీ నవరాత్రులలో భాగంగా కంటోన్మెంట్ 5వ వార్డు కాకాగూడ హనుమాన్ ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించిన హోమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ, అనురాధ దంపతులు కలిసి పాల్గొన్నారు. బొల్లారం రిసాల బజార్‌లోని శ్రీ బుజిలీ మహాకాళి ఆలయంలో సికింద్రాబాద్ శ్రీవేంకటేశ్వర పెరుమాళ్ దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ మురళీ యాదవ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు ఆయనకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తిరుమలగిరి బంజారా నగర్ కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో దుర్గా మాత వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం మహిళలు అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు.


మేడిబావి పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు


ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న డాక్టర్ కోట నీలిమ


శ్రీదుర్గాదేవీ అలంకరణలో కనకదుర్గ అమ్మవారు

ఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో ...

సికింద్రాబాద్, అక్టోబర్ 11(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో శుక్రవారం దసరా శరన్నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. విజయదశమి పండుగకు ముందు రోజు శుక్రవారం కావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణశ్రీనివాస్‌గౌడ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చండీహోమంలో జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్, అత్తెల్లి అరుణశ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


ఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో జరిగిన చండీహోమంలో జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్, అత్తెల్లి అరుణశ్రీనివాస్‌గౌడ్ తదితరులు


ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్

మహిషా సురమర్దినిగా దర్శనమిచ్చిన అమ్మవారు

- చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం, నామాలగుండు మండపాల వద్ద పూజలు చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బౌద్ధనగర్, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లలో దసరా నవరాత్రోత్సవాలు శుక్రవారం కనులపండువగా జరిగాయి. బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు శ్రీమహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయచైర్మన్ కొట్ట ధరణీధర్ దుర్గాదేవీని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం, నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపాలను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మేడిబావి ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవార్లు భద్రకాళిదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయచైర్మన్ పరికిబండి కళాప్రకాశ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొండల్ వెంకటేశ్వరరావు, పోట్టి శ్రీను, రాచమల్ల సంగీత్ పాల్గొన్నారు. పలు ఆలయాల్లో మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు.


నామాలగుండు దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు


బల్కంపేటలో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇచార్జి డాక్టర్ కోట నీలిమ

వైభవంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు


కట్టమైసమ్మ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బేగంపేట/తిరుమలగిరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఉత్సవాలు శుక్రవారం రాత్రి వైభవంగా జరిగాయి. సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మహిళలు బతుకమ్మలను పూలతో పేర్చి పాటలు పాడుతూ ఆడారు. బల్కంపేటలో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అభిషేక్, శ్రీనివాసరావు, రాజేశ్వరి, సీవన్‌రాజ్, రవి, ర జినీకాంత్ తదితరులు పాల్గొన్నారు. తిరుమలగిరి డివిజన్ మహేంద్రహిల్స్ త్రిమూర్తి కాలనీలోని శ్రీతమాల్ కుంట కట్టమైసమ్మ ఆలయం వద్ద మహిళా కమిటీ మహేశ్వరి, భానుశ్రీ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. మహిళలు బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు.


పకాశ్‌నగర్‌లోని శ్రీశ్రీశ్రీ భూలక్ష్మీ ఆలయంలో భక్తుల సందర్శన కోసం ఉంచిన అయోధ్య రాముని ధనస్సు, విల్లులు
- బేగంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి)


తుకారాంగేట్ రియోపాయింట్ హోటల్ వెనుక జై దుర్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు నర్సింగ్‌రావు, అశోక్, సురేష్, సాయి, వీరయ్య, ప్రకాశ్, రఘు, శ్రావణ్, శ్రీనివాస్, హరీష్, సుశీల్, నవీన్, యశ్వంత్, అరుణ్, వినయ్, విగ్నేష్, నగేష్, మహేష్, విశాల్, మూర్తి, సందీప్ పాల్గొన్నారు.
- అడ్డగుట్ట - ఆంధ్రజ్యోతి

మూడు వేల గజాల

ప్రభుత్వ స్థలంపై వివాదం

- ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తుండగా

అడ్డుకున్న ప్రైవేట్ వ్యక్తి

అడ్డగుట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలం చుట్టూ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తుండగా, ఓ వ్యక్తి అడ్డుకున్నాడు. దీంతో అధికారులు, ప్రైవేట్ వ్యక్తికి మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మారేడుపల్లి రెవెన్యూ పరిధి మహేంద్రాహిల్స్‌లోని సర్వే నెంబరు 844లో మూడు వేల గజాల స్థలం ఉంది. దానిని కొన్నేళ్ల క్రితం మారేడుపల్లి రెవెన్యూ అధికారులు జలమండలి విభాగానికి కేటాయించారు. శుక్రవారం జలమండలి అధికారులు స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తుండగా, నారాయణ అనే వ్యక్తి అక్కడి వచ్చి 3 వేల గజాల స్థలం తనదని చెప్పి అడ్డుకున్నాడు. దాంతో అధికారులు, నారాయణకు మధ్య మాటల యుద్ధం జరిగింది. దాంతో జలమండలి అధికారులు తుకారంగేట్ పోలీసులకు, మారేడుపల్లి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు స్థలం వద్దకు వచ్చి 'ఇది ప్రభుత్వ స్థలం.. స్థలం జోలికి ప్రైవేట్ వ్యక్తులు రావద్దు' అని హెచ్చరించారు. అనంతరం జలమండలి అధికారులను, ప్రైవేట్ వ్యక్తి నారాయణను తుకారంగేట్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ స్థలానికి సంబంధించిన డాక్యూమెంట్లు తీసుకొని ఈ నెల 13న స్టేషన్‌కు రావాలని చెప్పాడు.

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వృద్ధుడి ఆత్మహత్య

మారేడుపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మారేడుపల్లి సీఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్‌మారేడుపల్లి నెహ్రూనగర్ కాలనీలో నివాసముంటున్న వీఆర్‌జి కృష్ణన్(90) రిటైర్డ్ ఉద్యోగి. కొద్దిరోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో కుటుంబసభ్యులు డయాలసిస్ చేయిస్తున్నారు. వృద్ధాప్యంలో తరచూ ఆస్పత్రి పాలై ఇబ్బందులు పడుతున్న కృష్ణన్ జీవితంపై విరక్తి చెందారు. గురువారం అర్ధరాత్రి బాత్‌రూమ్‌కు వెళ్లి మెడకు అమర్చిన డయాలసిస్ పైపును బ్లేడుతో కోసివేయడంతో రక్తస్రావం జరిగి చనిపోయారు.